క్లుప్తంగా

చలో కరీంనగర్‌ను విజయవంతం చేయండి

పెబ్బేరు: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్‌లో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్రలో భాగంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా ఛత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి భూపేష్‌బగేల్ వస్తున్నారని, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కంచిరావుపల్లిలో రక్తదాన శిబిరం



పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లిలో బుధవారం యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరుగంటి విజయకుమార్‌శర్మ (తెలుగు భాష పండితులు) మూడో వర్ధంతిని పురస్కరించుకొని రక్తదానం చేయడంతో పాటు గురువుకు దక్కాల్సిన గౌరవం దక్కిందని సంతోషపడ్డారు. అలాగే 2006 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు గ్రామ యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాధ, యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్, విజయకుమార్‌శర్మ, కుటుంబ సభ్యులు, సతీమణి హేమలత, కూతురు కావ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



కొత్తకోట రూరల్: అడ్డాకుల మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పెద్దమందడి మండలం అమ్మపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ పోటీల్లో 32 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో అడ్డాకుల, అమ్మపల్లి జట్లు పోటీ పడ్డాయి. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో విజేతగా అడ్డాకుల నిలవగా, అమ్మపల్లి జట్టు రన్నర్‌గా స్థానం దక్కించుకుంది. రన్నర్‌గా నిలిచిన అమ్మపల్లి జట్టుకు రూ.10వేల నగదును నిర్వాహకులు అందజేశారు. సమష్టి కృషితోనే ఫైనల్ వరకు వచ్చామని, రన్నర్‌గా నిలిచేందుకు కష్టపడిన జట్టు సభ్యులకు కెప్టెన్ కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

తండాల్లో ఎక్సైజ్ దాడులు



పెద్దకొత్తపల్లి: మారేడుమాన్‌దిన్నె, చంద్రబండతండాలల్లో నాగర్‌కర్నూల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 60 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు కొల్లాపూర్ ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తండాలలో బెల్లం సరఫరా, నాటు సారా తయారు చేస్తే పీడీ యాక్ట్‌ను నమోదు చేస్తామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కోయిల్‌కొండ: మండలంలోని పారుపల్లి శ్వేతా విద్యామందిర్ పాఠశాలలో బుధవారం ఎస్‌ఐ శ్రీనయ్య సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా రానున్న పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు పరీక్షలు రాయాలని కోరారు. బాల్య వివాహాల వల్ల తలెత్తే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకట్‌జీ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ నిలపాలి

దేవరకద్ర: స్థానిక రైల్వేస్టేషన్‌లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేలా చూడాలని బీజేపీ మండల అధ్యక్షుడు అంజన్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, నారాయణరెడ్డి, జితేందర్‌రెడ్డి బుధవారం మహబూబ్‌నగర్ వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కేంద్రం కావడంతో పాటు దేవరకద్ర రైల్వేస్టేషన్ జంక్షన్‌గా గుర్తింపు పొందిందని తెలిపారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ ఆపకపోవడం వల్ల తిరుపతి వెళ్లే భక్తులు మహబూబ్‌నగర్ వెళ్లాల్సి వస్తున్నదని అన్నారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రితో మాట్లాడుతానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



ఖిల్లాఘనపురంలో కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్



కొత్తకోటలో మహిళా చిరు వ్యాపారులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వనపర్తి మహిళా డిగ్రీ కళాశాలలో..

మహిళతోనే సమాజ మనుగడ

సాక్షి, నెట్‌వర్క్: సృష్టిలో స్త్రీ శక్తికి ఎంతో గౌరవం ఉందని, అలాంటి మహిళామూర్తులు సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించి కుటుంబాలకు ఆదర్శంగా ఉండాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందించిన మహిళామణులను కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, విపక్షపార్టీలు, ప్రజా సంఘాలు, ఐద్వా, గిరిజన సంఘంఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలను, పారిశుద్ధ్య కార్మికులను గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు పద్మావతి, స్కాలర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ జగదీశ్వర్, ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్, కవి గిరిరాజాచారి, డాక్టర్ నరసింహాశర్మ, క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, భారత జాతీయ మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కళావతమ్మ, పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు గీత, ఇన్‌చార్జీ మున్సిపల్ కమిషనర్ బాలగోవిందు, మున్సిపల్ ఆర్‌ఐ క్రిష్ణయ్య, మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ, జెడ్పీటీసీలు కేసిరెడ్డి వెంకటరమణమ్మ, పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, రేవల్లి యూనియన్ బ్యాంకు మేనేజర్ వీరిత, తహసీల్దార్ నరేందర్ పాల్గొన్నారు.



వనపర్తిలోని జంగిడిపురంలో మహిళా దినోత్సవం జరుపుకొంటున్న నాయకులు



వనపర్తి సెయింట్ థామస్ స్కూల్‌లో..



తెల్లరాళ్లపల్లితండాలో..



ఆత్మకూర్‌లో..



చిన్నంబావిలో..



పెబ్బేరులో..



అమరచింతలో..



గోపాల్‌పేటలో..



ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా అవార్డు అందుకుంటున్న తారమ్మ



వనపర్తిలో పీఆర్టీయూ టీఎస్ సభ్యురాలు

అమ్మాయి వివాహానికి ఆర్థికసాయం

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లికి చెందిన పెద్దకుర్మయ్య, కృష్ణవేణమ్మ దంపతుల కుమార్తె అంజనమ్మ వివాహాన్ని పురస్కరించుకుని జిల్లా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేశ్ ఇంద్రకంటి ఛారిటబుల్ ట్రస్టు ద్వార రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. పేదరికంలో ఉన్న వీరి కుటుంబానికి కొద్దిపాటి ఆర్థిక వెసులుబాటు కల్పించాలన్న సదుద్దేశంతో తమ ట్రస్టు ద్వారా ఈ సాయాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ ఉడుత లక్ష్మయ్య యాదవ్ ఇటీవల మృతి చెందిన పుష్ప కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వెంకటస్వామిగౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీను, మీసాల కుర్మయ్య, నాగరాజు, గోవుల కృష్ణయ్య, సంగనమోని జమ్ములు, కుర్మయ్య, తెలుగు రవి, వడ్డె కృష్ణయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



వధువు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఇంద్రకంటి వెంకటేశ్

మొక్కల సంరక్షణకు జాగ్రత్తలు

కొత్తకోట రూరల్: ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దమందడి ఎంపీడీఓ అఫ్జల్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలోని దొడగుంటపల్లి, అనకాపల్లితండా, పెద్దమందడి, జంగమాయపల్లి, పామిరెడ్డిపల్లి గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించడంతో పాటు హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఎండల తీవ్రత ఉండటంతో నర్సరీలోని మొక్కలకు ఉదయం, సాయంత్రం రెండు పూటల నీళ్లు పట్టాలని ఆదేశించారు. ఎండిపోయిన బ్యాగులో కొత్తగా విత్తనాలు వేసి మొక్కలు వచ్చే విధంగా చూడాలన్నారు. మొక్కల పెరుగుదలకు, చనిపోకుండా అవసరమైన మందులను వాడాలని సూచించారు. అదేవిధంగా జీవామృతం తయారు చేసి 20రోజులకు ఒక్కసారి మొక్కలకు పిచికారీ చేయాలని తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వేగవంతం చేసేందుకు కూలీల సంఖ్య పెంచాలన్నారు. అదేవిధంగా గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.



దొడగుంటపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అఫ్జల్

పెద్దకొత్తపల్లి: గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలు పెంచాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. సాతాపూర్‌లో బుధవారం నర్సరీ, చెట్ల కట్టింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో నర్సరీలలో మొక్కలను విరివిగా పెంచి సంరక్షించాలని సూచించారు. ఔషధ, పండ్ల, పూలమొక్కలను పెంచాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు మణిరాం, వెంకటేశ్, ఈసీ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మినుము పంటకు నిప్పంటించిన దుండగుడు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్ గ్రామ శివారులో కృష్ణానది తీరాన నీటి మునక పొలాలనందు జటప్రోల్‌కి చెందిన కురవ మద్దిరెడ్డి గత కొన్నేళ్లుగా పొలాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటాడు. ఈసారి యథావిధిగా పంట వేసి పండించిన అనంతరం కోసి కుప్పవేశారని, బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు పొలం దగ్గరకు వెళ్లి చూడగా కాలి బూడిదైపోయింది. వెంటనే సర్పంచ్ ఎస్‌కే ఖాజా, గ్రామస్తులకు సమాచారం అందించగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాదాపు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. కొంతమందిపై అనుమానం ఉందని, వారిపై చర్యలు తీసుకునేవిధంగా సహకరించాలని సర్పంచ్‌ను వేడుకున్నారు.



కాలి బూడిదైన మినుము పంట

నేడు మానసిక రోగుల వైద్య శిబిరం

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం మానసిక రోగులకు వైద్య నిపుణులు డా.అంబుజా ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మానసిక ఆందోళన, తనలో తాను మాట్లాడుకోవడం, పిచ్చిపిచ్చిగా మాట్లాడటం వంటి లక్షణాలు ఉన్న మానసిక రోగులకు వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మానసిక రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంధత్వ నివారణకే 'కంటివెలుగు'

మండలంలోని రేమద్దుల, దావాజిపల్లి, మంగళ్లపల్లి గ్రామాల్లో గురువారం నుంచి కంటి వెలుగు శిబిరాలను ప్రారంభిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకుని పరీక్షలను చేయించుకోవాలని సూచించారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో మండల స్థాయి 12వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వారం రోజుల నుంచి గ్రామాలలో పర్యటించి పనుల అవకతవకలపై విచారణ చేసిన డీఆర్‌పీలు, మండల స్థాయి సామాజిక తనిఖీ కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు 2021–22 సంవత్సరానికి సంబంధించిన పనులను రికార్డులను ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్ అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల రికార్డులు, డీఆర్‌పీలు సమర్పించిన నివేదికలను ఆమె క్షుణంగా పరిశీలించారు. రికార్డులు, నివేదికలు సక్రమంగా లేనిగ్రామాల ఈజీఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి సోషల్ ఆడిట్‌లో అక్రమాలు జరిగినట్లు తెలితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. వేసవిలో కూలీలకు వందరోజులు పనులు కల్పించాలన్నారు. 12వ విడత సామాజిక తనిఖీలో గ్రామాలలో సక్రమంగా పనులు జరగలేదని ఆమె అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ముందుగా ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఎన్ఆర్‌ఈజీఎస్ నియామకాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. గ్రామాలలో సామాజిక తనిఖీల సభలు పెట్టకపోవడంతో ఆమె ఫీల్డ్ అసిస్టెంట్లను మందలించారు. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి సభలు పెట్టకపోవడం విడ్డూరమన్నారు. ఆమెతో పాటు వచ్చిన జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు కూడా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ మనోహర్, ఏపీఓ మల్లీకార్జున్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని గోవులాపురం, సింగవరంలలో హాథ్ సే హాథ్ జోడోయాత్ర కొనసాగుతోంది. ఇందులో భాగంగా కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు గడపగడప తిరిగి కాంగ్రెస్ చేసిన పథకాలు, భవిష్యత్‌లో చేయనున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు, రుణమాఫీ, ఇంట్లో అర్హత కలిగిన వారికి మిషన్, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేల రైతుబంధు అందిస్తుందన్నారు. గతంలో వైఎస్ హయాంలో ఎన్నో పథకాలు ప్రజలకు మేలు జరిగేలా ప్రవేశపెట్టారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టీఆర్‌ఎస్ కుటుంబ పాలన చేస్తుందని, అలాంటి ప్రభుత్వాలు ఉన్నా లేకున్నా ఒకటేనని అన్నారు. అటు కేంద్రంలో బీజేపీ పాలన పూర్తిగా అరాచకంగా మారిందని పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఇష్టానుసారంగా పెంచుతూ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కొల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని అన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ బ్లాక్ కాంగ్రెస్ రాముయాదవ్, శివానందం, రామకృష్ణగౌడ్, రాంచందర్, కురుమయ్య, గోపాల్, మహేష్ పాల్గొన్నారు.

తవ్వకాలు నిలిపివేయండి

చిన్నచింతకుట: కురుమూర్తి స్వామి గుట్ట వెనక భాగంలో అక్రమంగా తవ్వుతున్న క్వారీ పనులను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం తవ్వకాల క్వారీ వద్ద రైతులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, భగవంతు, పాండు తదితరులు ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రాజావళి ఉర్సు

- ఉత్సవాలకు ముస్తాబవుతున్న దర్గా షరీఫ్
- 10న గంధోత్సవంతో ప్రారంభం

అమరచింత: పట్టణ కేంద్రంలో వెలసిన సయ్యద్‌షా రాజావళి దర్గా ఉర్సు ఈనెల 10 నుంచి ప్రారంభం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉర్సుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్గా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. దర్గా పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఎంతో మహిమానిత్వం గల రాజావళి దర్గాను సందర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడానికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. కుల, మతాలకు అతీతంగా మతసామరస్యం చాటే వేడుకల్లో రాజావళి ఉర్సు ఎంతో గొప్పది.



ఉత్సవాలకు ముస్తాబవుతున్న రాజావళి దర్గా

దర్గా కమిటీ ఆధ్వర్యంలో..

మార్చి 10న గంధోత్సవంతో ఉర్సు ప్రారంభం అవుతుందని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. 11న తాజే చిరాక్, 12 ఖత్మే ఖురాన్‌తో కార్యక్రమాలతో ముగుస్తాయన్నారు. చివరి రోజు అన్నదాన కార్యక్రమం ఆలిండియా కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్‌గోరి ఆధ్వర్యంలో కొనసాగుతుందని వారు తెలిపారు.